సాక్షి ఒడిశా

గురువారం । 8 । ఆగస్టు । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ.4,03,380
బంగారం : 220 మిల్లీ గ్రాములు
వెండి : 149 గ్రాముల 900 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



9 జిల్లాల్లో లోటు వర్షపాతం

ఈ ఏడాది రుతు పవనాలు వచ్చి 2 నెలలు పూర్తయినా రాష్ట్రంలోని 9 జిల్లాల్లో ఇంకా లోటు వర్షపాతం కొనసాగుతోంది.

-8లో




తల్లిపాలు అమృత సమానం

తల్లిపాలు అమృత సమానమని వక్తలు పేర్కొన్నారు.

-8లో

జ్వర భద్రం



వానాకాలం ఆగమనంతో ప్రాణాంతక డెంగీ, మలేరియా పడగ విప్పుతున్నాయి. ఆస్పత్రులు పేషెంట్లతో కిటకిటలాడుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా లేకుంటే కొన్నిసార్లు ప్రాణాల మీదకే వచ్చే ప్రమాదముంది. దోమల బెడద లేకుండా నివాస గృహాలతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉంది. వ్యాధులు అపరిశుభ్రత వలనే వస్తున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అందువలన వేడిగా ఉండే ఆహారం, పరిశుభ్రమైన నీటిని తీసుకోవాలని సూచిస్తున్నారు.

– భువనేశ్వర్/రాయగడ/
మల్కన్‌గిరి/పర్లాకిమిడి

- రాష్ట్రాన్ని వణికిస్తున్న విష జ్వరాలు
- ప్రబలుతున్న డెంగీ, మలేరియా వ్యాధులు
- ఇప్పటికే పలువురు మృతి
- అప్రమత్తతే ఆయుధమని హెచ్చరిక





భువనేశ్వర్: అన్ని శాఖల కార్యదర్శులతో చీఫ్ సెక్రటరి డెంగీ నివారణ సన్నాహక సమావేశం

వర్షాకాలం కావడంతో రాష్ట్రంలో విష జ్వరాలు కలవర పెడుతున్నాయి. ఏమాత్ర అప్రమత్తంగా లేకున్నా ప్రాణాలను బలిగొంటున్నాయి. రాష్ట్రంలో ఈ ఏడాది జూలై నెలాఖరు నాటికి సమగ్రంగా 488 డెంగీ పాజిటివ్ కేసులు నమోదయ్యాయని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ నీలకంఠ మిశ్రా తెలిపారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు మొత్తం 35,470 మందికి డెంగీ పరీక్షలు నిర్వహించారు. ఖుర్దా జిల్లాలో అత్యధికంగా 130 పాజిటివ్ కేసులు ఖరారైనట్లు పేర్కొన్నారు. ఈ జిల్లాలో రాజధాని నగరం భువనేశ్వర్ డెంగీ కేసులకు హాట్‌స్పాట్‌గా ఉద్భవించింది. ఖుర్దా జిల్లాలో నమోదైన మొత్తం డెంగీ రోగుల్లో 50 శాతం మంది నగర వాసులు కావడం ఆందోళన కలిగిస్తోంది. భువనేశ్వర్ నగర పాలక సంస్థ (బీఎంసీ) ఆధ్వర్యంలో చేపట్టిన డెంగీ నివారణ చర్యలు క్రమంగా ఫలప్రదం అవుతున్నట్లు మేయర్ సులోచన దాస్ తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే డెంగీ కేసులు తగ్గాయన్నారు. అప్రమత్త కార్యాచరణలో భాగంగా నిఘా మరియు అవగాహన ప్రచారంతో ఇది సాధ్యమైందన్నారు. దీనిలో భాగంగా ఈనెల 22 నుంచి నగర వ్యాప్తంగా అన్ని వార్డుల్లో ఆటో-మాండేట్ మరియు హ్యాండ్-ఆపరేటెడ్ స్మోకింగ్ కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించనున్నారు.



భువనేశ్వర్: నగర వీధుల్లో దోమల నివారణకు మందు సించన్

చీఫ్ సెక్రటరి పర్యవేక్షణ

ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి అన్ని శాఖల కార్యదర్శులతో డెంగీ నివారణ, నియంత్రణ నేపథ్యంలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి అన్ని విభాగాలను అప్రమత్తం చేశారు. దోమల సంతత వృద్ధిని అరికట్టేందుకు మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రధానంగా పాఠశాలలు, హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పిల్లలను అప్రమత్తం చేసి డెంగీ బారిన పడకుండా వారికి అవగాహన కల్పించాలని కోరారు. హాస్టల్‌లో దోమతెరలు వాడాలని విద్యార్థులకు సూచించారు.

నిరంతర నిఘా

డెంగీ వ్యాప్తిని అరికట్టేందుకు రాష్ట్రంలోని జిల్లా ప్రధాన కార్యాలయాల ఆస్పత్రులు మరియు మెడికల్ కాలేజీల్లో 40 అప్రమత్త నిఘా (సెంటినల్ సైట్) కేంద్రాలను కేటాయించినట్లు రాష్ట్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ్ తెలిపారు. అన్ని జిల్లా ప్రధాన కార్యాలయాల ఆస్పత్రులు, కటక్ ఎస్సీబీ, బరంపురం ఎంకేసీజీ, బుర్లా విమ్‌సార్, రౌర్కెలా ఐజీహెచ్, తాల్చేరు, గుణుపురం సబ్ డివిజనల్ ఆస్పత్రులు, పారాదీప్ కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం, రాజధాని నగరంలో ఎయిమ్స్, క్యాపిటల్ ఆస్పత్రి, ప్రాంతీయ వైద్య పరిశోధన కేంద్రం (ఆర్‌ఎంఆర్‌సీ), పటియా ఆరోగ్య కేంద్రం, ఐఆర్‌సీ విలేజ్ ఆరోగ్య కేంద్రంలో ఈ కేంద్రాలు పని చేస్తున్నాయి. డెంగీ సంక్రమణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 49 వేల మంది ఆశా కార్యకర్తలను విభాగం రంగంలోకి దింపింది. వీరితో అదనంగా 30 జిల్లాల్లో 670 మంది వాలంటీర్లను నియమించినట్లు మంత్రి తెలిపారు.

వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- సీజనల్ వ్యాధులపై ప్రజలు ముందుగా అప్రమత్తంగా వ్యవహరించాలి.
- ఆరోగ్యం బాగోలేదని తెలిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.
- తాజా ఆహార పదార్థాలను మాత్రమే తీసుకోవాలి.
- పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత చాలా అవసరం.
- కాచిన నీటిని తాగాలి.
- జంక్ ఫుడ్‌లకు దూరంగా ఉండాలి.
- నిద్రించే సమయంలో దోమ తెరలు వినియోగించాలి.
- వ్యాధులు ప్రబలిన ప్రాంతాలకు ఏదైన పనిమీద వెళ్తే తగు జాగ్రత్తలు తీసుకోవాలి.
- తరచూ చేతులు శుభ్రపరుచుకోవాలి.
- యాంటీ బయోటిక్ మెడిసన్స్ ఎక్కువగా వినియోగించకూడదు.
- జలుబు, దగ్గు వంటివి వస్తే రాత్రి నిద్రించే సమయంలో వేడి నీటి ఆవిరి పడితే కొంతమేర ఉపసమనం లభిస్తుంది.

మల్కన్‌గిరిలో అతిసారం

మల్కన్‌గిరి జిల్లాలో వారం రోజుల్లో అతిసారం వ్యాధి బారినపడినవారు పెరిగినట్లు మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రి వైద్యుడు ప్రఫుల్ల కుమార్ తెలిపారు. జిల్లా మొత్తం మీద 28 మంది మహిళలు, 34 మంది పురుషులు, 20 మంది చిన్నారులు వ్యాధి బారినపడి చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో పరిశుభ్రత లోపం వలనే ఈ వ్యాధి వ్యాపిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం వైద్య సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు.



మల్కన్‌గిరి: జ్వరంతో చికిత్స పొందుతున్న వ్యక్తి

గజపతిలో డెంగీ గజగజ

గజపతి జిల్లాలో అడపాదడపా వర్షాలు పడడంతో డెంగీ కేసుల సంఖ్య పెరుగుతోంది. పర్లాకిమిడి పట్టణంలోని బట్టగౌడ వీధిలో ఆదివారం డెంగీ కేసు బయటపడడంతో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. పర్లాకిమిడి జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి, రాయఘడ బ్లాక్, ఖోజురిపద సీహెచ్‌సీ, గురండీ బ్లాక్ స్వాస్థ కేంద్రాల్లో 792 మందికి డెంగీ పరీక్షలు జరుపగా, అందులో 10 పాజిటివ్ కేసులు బయటపడినట్టు సీడీఎంవో డాక్టర్ మహ్మద్ ఆలీ తెలియజేశారు. దీంతో పర్లాకిమిడిలోని 50 పడకల మాతా శిశు ఆస్పత్రి ఆవరణలో కొత్తగా నిర్మించిన డెంగీ వార్డులోకి రోగులను తరలించినట్టు పేర్కొన్నారు.



పర్లాకిమిడి ఆస్పత్రి డెంగీ వార్డులో చికిత్స పొందుతున్న రోగులు

రాయగడలో వ్యాధుల పంజా

గత కొద్ది రోజులుగా రాయగడ జిల్లాలో విషజ్వరాలు పంజా విసురుతున్నాయి. ప్రతీరోజూ జ్వరాలతో జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చేరుతున్న రోజుల సంఖ్య పెరుగుతోంది. ఆశ్రమ పాఠశాలల్లో మలేరియా వ్యాధి విజృంభిస్తుండడంతో ఇప్పటికే ఈ వ్యాధి బారినపడి ముగ్గురు విద్యార్థులు మృతి చెందారు. అదేవిధంగా గత నెలలో కాసీపూర్ సమితి డొంగాశిలి పంచాయతీలోని మునిషిపాదొరొలో డిప్తీరియా బారినపడి ఇంకో ఆరుగురు చిన్నారులు మృతి చెందిన సంగతి తెలిసిందే. అయితే ప్రస్తుతం డిప్తీరియా అదుపులోకి వచ్చినప్పటికీ డెంగీ, మలేరియా వ్యాధులు ప్రజలను అతలాకుతలం చేస్తున్నాయి. తాజాగా కల్యాణ సింగుపూర్ సమితి మజ్జిగుడ గ్రామంలో ప్రతీ ఇంటిలో కనీసం ఒకరికి జ్వరం సోకినట్లు తెలుస్తుంది. ఇప్పటివరకు ఈ సీజన్‌లో 2000 మందికి పైగా వీటి బారిన పడ్డారని వైద్య శాఖ చెబుతోంది.



రాయగడ: ఇటీవల ఆరుగురు చిన్నారులు మృతి చెందిన మునిసిపాదొరొ గ్రామం



రాయగడ: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు



రాయగడ: కాసీపూర్‌లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యకర్తలు



రాయగడ: వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

న్యూస్‌రీల్

అభివృద్ధి పనుల పరిశీలన



ఇంజినీర్‌తో చర్చిస్తున్న సాగర్ ట్రస్టు కమిటీ సభ్యులు

జయపురం: పట్టణంలోని ప్రసిద్ధ జగన్నాథ్ సాగర్ అభివృద్ధి పనులను మా జగన్నాథ్ సాగర్ ట్రస్టు కమిటీ సభ్యులు బుధవారం పరిశీలించారు. మున్సిపల్ ఇంజినీర్ ప్రతాప్ చంద్ర ఆచార్య, సాగర్ ట్రస్టు సభ్యుడు శంకర ప్రహరాజ్, నిరంజన్ పాణిగ్రహి, మున పాణిగ్రహిలు సాగర్ అభివృద్ధి పనులపై చర్చించారు. అలాగే సాగర్ చుట్టూ ఉన్నటువంటి ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఆ స్థలాలను సాగర్ అభివృద్ధి కోసం వినియోగించే విషయంపై వివరాలు తెలుసున్నారు. అలాగే హనగుడ జంక్షన్ నుంచి బైపాస్ మధ్యలో ఒక కాలువ(డ్రైన్) నిర్మించి ఇరిగేషన్ డ్రైన్‌కు కలిపే విషయం, మత్స్య విభాగ కార్యాలయం వెనుకనున్న మట్టిని ఇతర ప్రాంతాలకు తరలించాల్సిన అవసరాన్ని ఇంజినీర్‌కు తెలిపారు. సాగర్ చుట్టూ ఇనుప కంచె నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. కాగా వర్షాలు తగ్గితే పనులు చురుకుగా కొనసాగించడం జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు.

పునరావాసం కల్పించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బస్తీవాసులు

రాయగడ: తమ బస్తీని తొలగించే ముందు తమకు పునరావాసం కల్పించాలని మునిగుడ సమితి బంటిపాడ బస్తీ వాసులు కోరుతున్నారు. ఈ మేరకు మునిగుడ తహసీల్దార్ ఎం.అనురాధను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రైల్వే స్థలాల్లో ఇళ్లు కట్టుకొని నివసిస్తున్న వారిని ఖాళీ చేయించేందుకు రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ మేరకు కొద్ది రోజుల క్రితం ఆక్రమణదారులకు రైల్వే శాఖ నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో తమ ఇళ్లను తొలగిస్తే నిర్వాసితులమవుతామని, అందువలన పునరావాసం కల్పించాలని కోరారు.

కొట్లాట కేసులో నలుగురు అరెస్టు



అరెస్టైనవారు

జయపురం: స్థానిక బాపూజీ నగర్‌లోని రెండు కుటుంబాల మధ్య ఏదో కారణంగా జరిగిన కొట్లాటలో ఉభయ పక్షాలకు చెందిన నలుగురు వ్యక్తులను పట్టణ పోలీసులు అరెస్టు చేసినట్లు పోలీసు అధికారి మనీష సాహు బుధవారం తెలియజేశారు. వారు తెలిపిన వివరాల మేరకు.. జూలై 16వ తేదీన రెండు కుటుంబాల మధ్య వివాదం తలెత్తింది. ఆ వివాదంలో ఉభయవర్గాలు మారణాయుధాలతో దాడులు చేసుకున్నారు. దీంతో ఇరువర్గాల నుంచి ఇద్దరి వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై పోలీసుస్టేషన్‌లో వేర్వేరుగా ఫిర్యాదులు నమోదయ్యాయి. దీంతో ఎస్‌ఐ మనీష సాహు దర్యాప్తు చేపట్టి నలుగురిని అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో బాపూజీ నగర్ స్వప్న దుర్గ, ఆమె కుమారుడు, సురేంద్ర దుర్గ, అతడి కుమారుడు ఆనంద్ దుర్గ ఉన్నట్లు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో ముందరి చక్రం విరిగిపోయిన ఆటో



చెట్టుకు ఢీకొన్న కారు


రాయగడ: ఎదురెదురుగా వస్తున్న కారు, ఆటో ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు గాయాలపాలయ్యారు. జిల్లాలోని బిసంకటక్ సమితి బొడొగొతిగుడ కూడలిలో మంగళవారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. ఐఐసీ సూర్యచంద్ర పాడి తెలిపిన వివరాల మేరకు.. బిసంకటక్ మీదుగా విశాఖపట్నం వెళ్తున్న కారు బృందావడి గ్రామం నుంచి ధాన్యం లోడుతో వస్తున్న ఆటోను బొడొగొతిగుడ కూడలిలో అదుపు తప్పి ఢీకొంది. అయితే సకాలంలో కారులోని బెలూన్‌లు ఓపెన్ కావడంతో కారులో ప్రయాణించే ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదంలో కారు ముందరి భాగం పూర్తిగా నుజ్జునుజ్జవ్వగా, ఆటో ముందు చక్రం విరిగిపోయింది. క్షతగాత్రులను బిసంకటక్‌లోని క్రిస్టియన్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. గాయాలైనవారి వివరాలు తెలియాల్సి ఉంది.

సెలవుల్లో ఉపాధ్యాయులు.. బడి బంద్



మధ్యాహ్న భోజనానికి పాఠశాలకు వచ్చిన విద్యార్థులు

జయపురం: ఉపాధ్యాయులు సెలవు పెడితే పాఠశాల మూసివేసిన ఘటన జయపురంలో చోటుచేసుకుంది. దీనిపై అధికారులు ఒక ప్రకటన విడుదల చేయడం గమనార్హం. స్థానిక ఇరిగేషన్ కాలనీ ప్రాజెక్టు పాఠశాలలో పనిచేసే ఇద్దరు ఉపాధ్యాయులు వ్యక్తిగత పనుల దృష్ట్యా సెలవు పెట్టారు. దీంతో ఈనెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు మొత్తం మూడు రోజుల పాటు పాఠశాలకు సెలవులు ఇస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే విద్యార్థులు పాఠశాల వద్ద మధ్యాహ్నం భోజనం చేయవచ్చని తెలియజేశారు. దీంతో ఇది బాధ్యతా రాహిత్యమని ప్రజలు విమర్శిస్తున్నారు. జయపురం ఇరిగేషన్ కాలనీ ప్రాజెక్టు విభాగం వారు 1978లో ఈ పాఠశాలను ప్రారంభించారు. 1987లో ఉన్నత పాఠశాలగా మారింది. పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మొత్తం 177 మంది విద్యార్థులు చదువుతున్నారు. గతంలో పాఠశాలలో తగినంత మంది ఉపాధ్యాయులు ఉండేవారు. అయితే కొంతకాలంగా ఒక్కొక్క ఉపాధ్యాయుడు రిటైర్ అవుతూ చివరికి ఇద్దరు మిగిలారు. కాగా ఇప్పుడు వారు కూడా సెలవు పెట్టడంతో పాఠశాలకు సెలవు ప్రకటించాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే ఉపాధ్యాయుల కొరత నెలకొన్నా ప్రాజెక్టు అధికారులు ఎవరినీ నియమించకపోవడం దురదృష్టకరమని స్థానికులు అంటున్నారు.



ବିଜ୍ଞାପନ

పాఠశాలకు మూడు రోజులు సెలవులు ప్రకటిస్తూ ఇచ్చిన ప్రకటన

శిథిలావస్థలో దిగాపూర్ పీహెచ్‌సీ

జయపురం: సబ్ డివిజన్ పరిధి కుంద్ర సమితి దిగాపూర్‌లోని ప్రాథమిక వైద్య కేంద్రం శిథిలావస్థకు చేరుకుంది. ఈ వైద్య కేంద్రంపై దిగాపూర్, ఘుమర, మొసిగాం గ్రామ పంచాయతీలకు చెందిన సుమారు 15 వేల మంది ప్రజలు వైద్య సేవలకు ఆధారపడుతున్నారు. కేవలం సాధారణ రోగులే కాకుండా గర్భిణులు, శిశువులు కూడా వైద్య సౌకర్యం పొందగలుగుతున్నారు. అయితే 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ వైద్యశాల శిథిలావస్థకు చేరడంతో రోగులతో పాటు డాక్టర్లు, నర్సులు, ఇతర వైద్య సిబ్బంది ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడితే పైనుంచి వర్షపు నీరు పడుతోందని, దీంతో డాక్టర్లు రోగులను పరీక్షించడం కష్టంగా మారుతోందని వాపోతున్నారు. చేసేదేమీలేక వాహన షెడ్డులో ఒక బెడ్ వేసి అక్కడ రోగులకు సెలైన్లు ఎక్కిస్తున్నారు. ప్రభుత్వం నూతన భవణాలు నిర్మించేందుకు రూ.97 లక్షలు మంజూరు చేసినా, ఇంతవరకు పనులు మొదలవ్వలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరితగతిన భవన నిర్మాణాలు చేపట్టాలని కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన ప్రాథమిక వైద్య కేంద్రం

క్లుప్తంగా

బొరిగుమ్మలో హెటా బాగ్ హల్‌చల్



బిజాగుడలో సంచరిస్తున్న హెటాబాగ్

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొరిగుమ్మ సమితి కొణగాం గ్రామ పరిసరాల్లో హెటా బాగ్(మచ్చల హైనా) బుధవారం సంచరించింది. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. బహిర్భూమికి వెళ్లిన కొంతమందిని వెంబడించడంతో భయంతో పరుగులు తీశారు. కొంత మంది హైనాను తరిమి కొట్టేందుకు ప్రయత్నించగా అది వారిపై తిరగబడిందని అటవీ విభాగానికి తెలియజేశారు. అడవిలో ఆహార కొరత వలన జంతువులు జనారణ్యంలోకి వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు.

6,522 టెంకాయల సమర్పణ



అమ్మవారికి సమర్పించిన టెంకాయలు

భువనేశ్వర్: ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో భారీ ఆధిక్యతతో విజేతగా నిలిచిన శాసనసభ సభ్యుడు ఆధిక్య ఓట్లకు సరిపడా టెంకాయలను కొట్టి మొక్కు తీర్చుకున్నారు. గంజాం జిల్లా చికిటి నియోజకవర్గం నుంచి రాష్ట్ర శాసనసభకు ఎన్నికైన మనోరంజన్ ద్యాన్ సామంత్రాయ్ తన భక్తి భావాన్ని ఇలా చాటుకున్నారు. ఎన్నికల్లో పోటీ పురస్కరించుకుని ఆధిక్యతతో గెలుపొందితే ఆధిక్యత ఓట్ల లెక్కతో టెంకాయలను సమర్పించుకుంటానని సంకల్పించుకున్నారు. సంకల్పం సిద్ధించడంతో మొక్కు తీర్చుకున్నారు. నియోజకవర్గంలో తన సమీప ప్రత్యర్థి బిజూ జనతా దళ్ అభ్యర్థిపై 6,522 ఓట్లు ఆధిక్యతతో గెలిపొందారు. ఈ లెక్క ప్రకారం పాత్రపురం ఆరాధ్య దేవత కుతారీశ్వరి అమ్మవారికి టెంకాయలను సమర్పించారు. ఈ ప్రక్రియలో ఎమ్మెల్యేకి మనూ సేన కార్యకర్తలు సహకరించారు. దాదాపు గత రెండున్నర దశాబ్దాలుగా ఈ నియోజకవర్గంలో బీజేడీ హవా కొనసాగింది. దీర్ఘకాలం తర్వాత భారతీయ జనతా పార్టీ అభ్యర్థి గెలిపొందడం విశేషం.

ఇసుక లారీ పట్టివేత



పట్టుబడిన లారీ

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని గ్రామ రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. బుధవారం ఉదయం గార నుంచి బైరి, సింగుపురం మీదుగా వెళ్తుండగా ఈ లారీని పట్టుకొని సేఫ్‌సైడ్ కస్టోడియన్ నిమిత్తం శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ దాడుల్లో బైరి, కరజాడ, పొన్నాం, బట్టేరు వీఆర్వోలు గణేష్, పాపారావు, యశ్వంత్ పాల్గొన్నారు.

వ్యక్తిపై టీడీపీ కార్యకర్త దాడి

శ్రీకాకుళం రూరల్: మండలంలోని సానివాడకు చెందిన యడ్ల శ్యామ్‌సుందర్‌పై అదే గ్రామానికి చెందిన మద్దిల శ్రీను అనే టీడీపీ కార్యకర్త మంగళవారం దాడికి పాల్పడ్డాడు. వీరిద్దరికీ కొంతకాలంగా రాజకీయ విభేదాలు ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే శ్యామ్‌సుందర్‌పై శ్రీను కత్తితో దాడికి పాల్పడ్డాడు. గాయాలపాలైన శ్రీనును వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అవుట్ పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వలియాసాగరంలో వైద్య శిబిరం



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ పవన్ తేజ

టెక్కలి రూరల్: గత కొద్ది రోజులుగా వలియాసాగరం గ్రామంలో పలువురు జ్వరాల బారిన పడుతుండటంతో 'వలియాసాగరంలో జ్వరాల విజృంభణ' అనే శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. బుధవారం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. లింగాలవలస పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పవన్ తేజ ఆధ్వర్యంలో వైద్య బృందం ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం పంచాయతీ సిబ్బంది సహాయంతో గ్రామంలో క్లోరినేషన్ పనులు చేయించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి జి.కూర్మనాయుకులు, విస్తరణ అధికారి ఎ.అప్పారావు, వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

9 జిల్లాల్లో లోటు వర్షపాతం



- మల్కన్‌గిరి జిల్లాలో అత్యధిక వర్షపాతం

రాష్ట్రంలో బుధవారం వర్షపాతం

ప్రాంతం	వర్షపాతం (మిల్లీ మీటర్లు)
నవరంగపూర్	45.4
కొరాపుట్	18.0
నువాపడా	12.4
కటక్	11.0
మల్కన్‌గిరి	10.8
నయాగడ్	10.0

భువనేశ్వర్: ఈ ఏడాది రాష్ట్రంలోనికి రుతు పవనాలు ముందస్తుగా ప్రవేశించినా ప్రయోజనం అంతంతమాత్రంగానే కనిపిస్తోంది. ఈ సీజన్‌లో 2 నెలలు పూర్తయినా రాష్ట్రంలో 9 జిల్లాల్లో ఇంకా లోటు వర్షపాతం కొనసాగుతోంది. ఈ జాబితాలో అత్యధిక లోటు వర్షపాతంతో భద్రక్, బాలాసోర్ జిల్లాల్లో పరిస్థితి ఆందోళనకరంగా కొనసాగుతుంది. ఈ రెండు జిల్లాల్లో 44 శాతం చొప్పున లోటు వర్షపాతం కొనసాగుతోంది. అలాగే పూరీలో 36 శాతం, జాజ్‌పూర్ మరియు కెంజొహార్ జిల్లాల్లో 32 శాతం చొప్పున లోటు, సందరగడ్ 33 శాతం, ఝార్సుగుడలో 29 శాతం, కేంద్రాపడాలో 28 శాతం, మయూర్‌భంజ్‌లో 26 శాతం లోటు వర్షపాతం ఉంది.

సమగ్ర వర్షపాతం 604.7 మిల్లీమీటర్లు

ఈ ఏడాది జూన్ 1 నుంచి ఆగస్టు 7 వరకు రాష్ట్రంలో సమగ్ర వర్షపాతం 604.7 మిల్లీ మీటర్లు నమోదైంది. ఈ వ్యవధిలో సాధారణ వర్షపాతం 643.6 మిల్లీ మీటర్లుగా అంచనా. రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక భారీ వర్షపాతం మల్కన్‌గిరి జిల్లాలో నమోదు కావడం విశేషం. ఈ జిల్లాలో ఇప్పటివరకు 68 శాతం ఆధిక్యత సమగ్ర వర్షపాతం 1,204.8 మిల్లీ మీటర్లు నమోదు అయింది. మరో 4 జిల్లాల్లో భారీ వర్షపాతం రికార్డు అయింది. ఈ జిల్లాల్లో సాధారణం కంటే 20 శాతం పైబడి వర్షం కురిసింది. 40 శాతం ఆధిక్యతతో బౌద్ జిల్లాలో 806.5 మిల్లీ మీటర్లు, 33 శాతం ఆధిక్యతతో నువాపడా జిల్లాలో 765.5 మిల్లీ మీటర్లు, 30 శాతం ఆధిక్యతతో సోన్‌పూర్‌లో 870.7 మిల్లీ మీటర్లు, కొరాపుట్ జిల్లాలో 24 శాతం ఆధిక్యతతో 863.1 మిల్లీ మీటర్ల వర్షపాతం రికార్డు అయింది. మిగిలిన 16 జిల్లాల్లో సాధారణ వర్షపాతం కొనసాగుతోంది.

సంక్షిప్తంగా...

మో సర్కార్ తొలగింపు

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వం 5టీ చార్టర్, మో సర్కార్‌ని తొలగించింది. ప్రభుత్వ ఉద్యోగుల రహస్య నివేదికల తయారీలో ఈ వ్యవస్థని గత ప్రభుత్వం ప్రవేశపెట్టింది. బుధవారం సాధారణ పాలన మరియు ప్రజాభియోగాల విభాగం ఈ వ్యవస్థ తొలగించినట్లు నోటిఫికేషన్ జారీ చేసింది.

సీఎంను కలిసిన యూఎస్ కాన్సుల్ జనరల్

భువనేశ్వర్: హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ బుధవారం స్థానిక లోక్ సేవా భవన్‌లో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీని కలిశారు. అమెరికా మరియు ఒడిశా మధ్య భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే మార్గాలపై ఈ సందర్భంగా చర్చించారు.

జమ్మూకాశ్మీర్ డీజీపీగా ఒడిశా వ్యక్తి

భువనేశ్వర్: ఒడిశాలో జన్మించిన సీనియర్ ఐపీఎస్ అధికారి రష్మీ రంజన్ స్వయినును జమ్మూ కాశ్మీర్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా హోం మంత్రిత్వ శాఖ నియమించింది. అతను ఒడిశాలోని రౌర్కెలా నగరానికి చెందినవాడు.

విజిలెన్స్ అదుపులో అఠాగొడా బీడీవో

భువనేశ్వర్: కటక్ జిల్లా అఠాగొడా మండల అధికారి ప్రదీప్ కుమార్ సాహు రాష్ట్ర విజిలెన్స్ వలలో చిక్కుకున్నారు. ఆదాయానికి మించిన ఆస్తులు సంపాదించిన ఆరోపణ కింద ఆయనను అదుపులోకి తీసుకున్నారు. 8 ప్రదేశాల్లో బుధవారం ఏకకాలంలో జరిపిన సోదాల్లో 2 భవనాలు, భువనేశ్వర్‌లోని 1 ఫ్లాట్, 3 ప్లాట్లు, రూ.6 లక్షల నగదు లభ్యమయ్యాయి.

హిరాకుద్ జలాశయం 2 గేట్లు మూసివేత

భువనేశ్వర్: సంబలపూర్ జిల్లాలో హిరాకుద్ జలాశయంలోనికి నీటి ప్రవాహం తగ్గడంతో బుధవారం మరో 2 స్లూయిస్ గేట్లను మూసివేశారు. జలాశయం నుంచి అదనపు నీటిని ప్రస్తుతం ఆనకట్ట ఎడమ స్పిల్‌వేపై 5, కుడి స్పిల్‌వేపై 3 సహా ఎనిమిది గేట్ల ద్వారా విడుదల చేస్తున్నారు.

రాయగడలో ఎయిర్ పోర్టు ఏర్పాటు అవసరం

- కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి ఉలక



పార్లమెంట్ సమావేశాల్లో మాట్లాడుతున్న ఎంపీ సప్తగిరి

రాయగడ: పట్టణంలో ఎయిర్ పోర్టు ఏర్పాటు అవసరంపై కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి ఉలక బుధవారం పార్లమెంట్ జీరో అవర్‌లో ప్రస్తావించారు. అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతున్న రాయగడ జిల్లాలో జేకే పేపర్ మిల్స్, ఇండియన్ మెటల్స్ అండ్ ఫెర్రో ఎల్లోయిస్, ఉత్కళ అలూమిన వంటి బృహత్తర పరిశ్రమలతో పాటు రాయగడ రైల్వే డివిజన్‌గా ఏర్పాటు కానుందన్నారు. అదేవిధంగా పర్యాటక రంగంలో గణనీయంగా పురోగతి చెందుతున్న నేపథ్యంలో ఎయిర్ పోర్టు ఎంతో అవసరమన్నారు. రాయగడలోని జైపూర్ సుగర్ ఫ్యాక్టరీకి సంబంధించిన సుమారు 500 ఎకరాల స్థలం రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో ఉందని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఎయిర్ పోర్టు ఏర్పాటుకు సానుకూల వాతావరణం ఉండడంతో కేంద్ర ప్రభుత్వం ఎయిర్ పోర్టు ఏర్పాటుపై తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా కొరాపుట్ జిల్లాలోని జయపురం ఎయిర్‌పోర్టు రన్‌వే 1200 మీటర్లు మాత్రమే ఉందని, దీనిని 2700 మీటర్ల వరకు విస్తరించాలని కోరారు.

తల్లిపాలు అమృత సమానం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

జయపురం: తల్లిపాలు అమృత సమానమని వక్తలు పేర్కొన్నారు. సమితిలోని నాలుగు పంచాయతీల్లో చైల్డ్ ఫండ్ విభాగం ఆధ్వర్యంలో అవగాహన శిబిరం బుధవారం నిర్వహించారు. దాదాపు 20 గ్రామాల్లో గర్భిణులకు చిన్నారులకు తల్లిపాలు తాగించడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. మలిసాహి, సుండిగుడ, బాలాపుట్, నువాగుడ, డొంబుగుడ, దేవఘాట్, బిశాయిపుట్ తదితర గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో రొండాపల్లి సర్పంచ్ ఆనంద్ హల్వా, పీఈవో సనాతన పండ, రమణగుడ ఆస్పత్రి అధికారి డాక్టర్ లక్ష్మీప్రియ రౌత్‌రాయ్, హెల్త్ వర్కర్లు సుజాత, కనకప్రభ సాగర్, వందిత తరాసియ, ఎ.కుని దేవి, చైల్డ్ ఫండ్ ప్రతినిధులు పూర్ణిమ బాగ్, మంటుప్రసన్న మహంతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చేనేత దినోత్సవం



చేనేత దుస్తులను ధరించిన అధికారులు

రాయగడ: స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్‌తో పాటు జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు చేనేత వస్త్రాలను ధరించారు. చేనేత కార్మికులకు ప్రభుత్వం ఎంతో చేయూతనిస్తోందని, అందుకు మన వంతు సహకారం అందిచాలని సూచించారు. ప్రతీ వారానికి ఒకరోజు చేనేత దుస్తులు ధరించాలన్నారు.

రాజ్యసభ ఉప ఎన్నిక షెడ్యూలు జారీ

భువనేశ్వర్: భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) రాజ్యసభ ఉప ఎన్నిక షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ ఏడాది సెప్టెంబర్ 3న పోలింగ్ జరుగుతుంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిరవధికంగా కొనసాగుతుంది. అదేరోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్లు లెక్కిస్తారు. రాష్ట్రంలో ఒక స్థానం భర్తీ కోసం ఈ ఉప ఎన్నిక జరుగుతుంది. మొత్తం మీద దేశంలో 12 రాజ్యసభ స్థానాలకు ఉప ఎన్నిక జరగనుంది. రాష్ట్రం నుంచి మమతా మహంతా రాజీనామా చేయడంతో ఒడిశా నుంచి ఒక రాజ్యసభ స్థానం ఖాళీ అయిన విషయం తెలిసిందే. జూలై 31న మమతా మహంతా రాజ్యసభ సభ్యత్వంతో పాటు బిజూ జనతా దళ్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. మర్నాడు భారతీయ జనతా పార్టీలో చేరారు. వాస్తవానికి 2026 సంవత్సరం ఏప్రిల్ వరకు ఆమె రాజ్యసభ సభ్యత్వం కొనసాగాల్సింది.

రాజ్యసభ ఉప ఎన్నిక షెడ్యూల్

నోటిఫికేషన్ జారీ	14 ఆగస్టు 2023
నామినేషన్ దాఖలు చేయడానికి చివరి తేదీ	21 ఆగస్టు 2024
నామినేషన్ దస్తావేజుల పరిశీలన	22 ఆగస్టు 2024
పోటీ నుంచి విరమణ గడువు	27 ఆగస్టు 2024
పోల్ తేదీ	3 సెప్టెంబర్ 2024
ఓట్ల లెక్కింపు	3 సెప్టెంబర్ 2024

'శిష్టకరణ ఓబీసీ సాధన'కు కదలిరండి



మాట్లాడుతున్న శిష్టకరణ జాతీయ కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస పట్నాయక్

శ్రీకాకుళం పీఎన్ కాలనీ: శిష్టకరణ ఓబీసీ సాధన సమావేశం శ్రీకాకుళం శిష్టకరణ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ శిష్టకరణ రాష్ట్ర అధ్యక్షుడు పోలుమహంతి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కులపెద్దల సహకారంతో రాష్ట్రంలో అన్ని జిల్లాల కమిటీ నాయకులు సమష్టి కృషితో ఓబీసీ సాధనకు కృషి చేస్తామన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 9 నుంచి 12వ తేదీల మధ్య ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలవనున్నామని, శ్రీకాకుళం నుంచి పెద్ద ఎత్తున నాయకులు కదిలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ జాతీయ కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్, జిల్లా అధ్యక్షుడు డబ్బీరు శ్రీనివాసరావు, విశాఖ అధ్యక్షుడు గొడవ ప్రభాకర్‌దాస్, బద్రి మహంతి, వెంకటరావు, డబ్బీరు సత్యప్రసాద్, మురళి, శర్మ, బెహరా రామచంద్రారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీకి వస్త్రం బహూకరణ



మోదీకి చేనేత వస్త్రాన్ని బహూకరిస్తున్న ఎంపీ అప్పలనాయుడు

రణస్థలం: జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకుని బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మోదీ చిత్రంతో కూడిన చేనేత వస్త్రాన్ని ఢిల్లీలో బహూకరించారు. లావేరు మండల కేంద్రానికి చెందిన చేనేత కార్మికులు బాసిన నాగేశ్వరరావు, లక్ష్మీ దంపతులు మూడు అడుగుల వెడల్పు, ఆరడుగుల పొడవు గల వస్త్రంపై 40 రోజులపాటు శ్రమించి ఈ వస్త్రాన్ని తయారు చేశారు. ఈ సందర్భంగా ప్రధాని చేనేత కార్మికులకు అభినందనలు తెలిపినట్లు ఎంపీ చెప్పారు.

సిక్కోలు చేనేతకు ప్రత్యేక గుర్తింపు



రాట్నం వడుకుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం: జిల్లాలోని చేనేత వస్త్రాలకు ప్రత్యేక గుర్తింపు ఉందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. చేనేత, జౌళి శాఖ, సిక్కోలు వీవర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ఆధ్వర్యంలో 10వ జాతీయ చేనేత దినోత్సవం కార్యక్రమం బుధవారం శ్రీకాకుళం బాపూజీ కళామందిర్‌లో నిర్వహించారు. ముందుగా వస్త్ర ప్రదర్శన, రాట్నం, వస్త్ర తయారీ విధానాన్ని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ చేనేత పరిశ్రమ లాభసాటిగా ముందుకు సాగాలంటే మార్కెటింగ్ కీలకమని చెప్పారు. వినియోగదారుల అభిరుచులకు తగ్గ వస్త్రాలు తయారు చేయాలన్నారు. వ్యవసాయం తరువాత దేశంలో ఎక్కువ మంది చేనేత, జౌళి రంగంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారని చెప్పారు. పొందూరు ఖాదీకి ప్రపంచ స్థాయి గుర్తింపు ఉందన్నారు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి డిజిటల్ షాపింగ్ యాప్‌ల ద్వారా అమ్మకాలు చేస్తే ఎక్కువ మందికి చేనేత వస్త్రాలు చేరువ అవుతాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ముద్ర రుణాలను చేనేత కార్మికులు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం చేనేత కళాకారుడు ముచ్చా శ్రీనివాసరావును సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు ఎస్.శ్రీదేవి, హర్షవల్లి, చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకులు సాయిప్రసాద్, నాబార్డు డీడీ రమేష్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పీజీ కౌన్సెలింగ్‌కు వేళాయె

- జిల్లాలో అందుబాటులో 16 కోర్సులు.. 1115 సీట్లు
- వెబ్ ఆప్షన్ల నమోదు ప్రారంభం



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ ప్రవేశాలకు సంబంధించిన ఏపీ పీజీసెట్- 2024 కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఉన్నత విద్యా మండలి విడుదల చేసింది. జూన్ 10 నుంచి 13 వరకు ఆన్‌లైన్‌లో ప్రవేశ పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసింది. విద్యార్థులు తమ ర్యాంకు, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా ఆన్‌లైన్‌లో వెబ్‌ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 16 పీజీ కోర్సుల్లో 559 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వర్సిటీ అనుబంధంగా ఏడు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో మరో 556 సీట్లు ఉన్నాయి. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం మహిళల ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సైతం పీజీ కోర్సులు నిర్వహిస్తున్నాయి. ఈ నెల 12 వరకు విద్యార్థులు ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుంది. పీజీ సెట్‌లో ర్యాంకు సాధించిన వారు మాత్రమే అర్హులు. వీరికి మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుంది. పూర్తి వివరాలకు ఏపీఎస్‌హెచ్‌ఈ.ఏపీ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

ఆప్షన్లు ఇచ్చుకోవాలి..

షెడ్యూల్ మేరకు ఈ నెల 12లోపు ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుంది. పీజీ సెట్ అర్హత సాధించిన విద్యార్థులు కౌన్సెలింగ్ సద్వినియోగం చేసుకోవాలి. వర్సిటీ, అనుబంధ కళాశాల్లో పీజీ కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– పి.సుజాత, రిజిస్ట్రార్, బీఆర్ఏయూ

అంబేద్కర్ వర్సిటీలో సీట్లు ఇలా..

కోర్సు	సీట్లు
ఎకనామిక్స్	40
ఇంగ్లీష్	40
రూరల్ డెవలప్‌మెంట్	40
సోషల్ వర్కు	40
తెలుగు	40
ఎంకాం	40
ఎంఈడీ	40
ఎంఎల్ఐఎస్సీ	40
అప్లైడ్ మ్యాథ్స్	22
అనలాటికల్ కెమిస్ట్రీ	22
ఆర్గానిక్ కెమిస్ట్రీ	33
బయోటెక్నాలజీ	30
ఫిజిక్స్‌లో 40	
మ్యాథ్స్	40
మైక్రోబయోలజీ	22
ఎంజేఎంసీ	30

సమన్వయంతో పనిచేస్తే మెరుగైన 'ఉపాధి'



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉపాధి హామీ పథకం సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే గ్రామాల్లో స్థిరాస్తులు, మౌలిక సదుపాయాలు ఏర్పడతాయని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.చిట్టిరాజు అన్నారు. బుధవారం జిల్లా కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఆగస్టు 15నఅన్ని అమృత్ సరోవర్ చెరువుల వద్ద జాతీయ జెండా ఎగరవేయాలని సూచించారు. విజిలెన్స్ అధికారి బి.లవరాజు మాట్లాడుతూ సామాజిక తనిఖీ రికవరీలను తక్షణమే చెల్లించాలన్నారు.సమావేశంలో ఫైనాన్స్ మేనేజర్ స్వరూపరాణి, ఏపీడీలు మురళీకృష్ణ, శైలజ, పి.రాధ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సేవా దృక్పథం అవసరం



మాట్లాడుతున్న వీసీ రజిని

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు సేవా దృక్పథం పెంచుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని అన్నారు. వర్సిటీ సెమినార్ హాలులో బుధవారం జిల్లా విద్యా సంస్థల జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) ప్రోగ్రాం అధికారులలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం, ఆరోగ్యం, బహిరంగ మల విసర్జన వల్ల కలిగే నష్టాలు వంటి అంశాలపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. విద్యార్థులు ఎన్ఎస్ఎస్‌లో చేరేందుకు ఆసక్తి చూపాలన్నారు. కార్యక్రమంలో రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, జాతీయ సేవా పథకం జిల్లా సమన్వయకర్త ఎం.అనురాధ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోగం వస్తే డోలీయే శరణ్యం


రోగిని డోలీపై తీసుకు వెళ్తున్న దృశ్యం

మక్కువ: మండలంలోని దేవరశిర్లం పంచాయతీ మెట్టలోవర కండి గ్రామానికి చెందిన గిరిజనులకు రోగమొస్తే డోలీయే వారికి శరణ్యం. గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో, ఏ కష్టసుఖాలకైనా పొలం గట్లపై నుంచి నడక సాగించక తప్పని దుస్థితి గ్రామస్తులకు దాపురించింది. గ్రామానికి చెందిన మెల్లిక దిగుడమ్మ నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. వైద్యసిబ్బంది చికిత్స అందించినప్పటికీ, తగ్గుముఖ పట్టకపోవడంతో బుధవారం కుటుంబసభ్యులు దిగుడమ్మను డోలీలో మక్కువలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా


చెరువుగట్టుపై బోల్తాపడిన ఇసుక ట్రాక్టర్

రాజాం సిటీ: రాజాం మున్సిపాలిటీ పరిధి కొండంపేట-బుచ్చెంపేట గ్రామాల మధ్య ఉన్న ఈరా చెరువు గట్టుపై బుధవారం ఉదయం ఇసుక ట్రాక్టర్ అదుపు తప్పడంతో ట్రక్కు బోల్తాపడింది. కళాశాల, పాఠశాలలు, ఆస్పత్రికి వెళ్లే రహదారి కావడంతో ప్రజలు అధిక సంఖ్యలో ఈ రహదారినే వినియోగిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే అడ్డూ అదుపులేకుండా ఇసుక అక్రమరవాణాకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే ఇసుకను తరలిస్తుండగా అదుపుతప్పి ట్రక్కు చెరువు వైపు బోల్తాపడింది. అయితే అదృష్టవశాత్తు ఆ సమయంలో ఆ రహదారి గుండా ఎవరూ వెళ్లకపోవడంతో పెనుప్రమాదమే తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఇసుక రవాణా ప్రతిరోజూ వేకువ జాము నుంచి చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఇసుక ట్రాక్టర్లు

సీతానగరం: మండలంలోని సువర్ణముఖి నది ప్రాంతం బూర్జ రేవు నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక లోడ్‌చేసి తరలిస్తుండగా బుధవారం ఉదయం పోలీసులు మూడు ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. దీనిపై ఎస్సై ఎం.రాజేష్ మాట్లాడుతూ అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి మండల మేజిస్ట్రేట్ తహసీల్దార్ జె.రాములమ్మ ఎదుట హాజరు పర్చినట్లు తెలియజేశారు. తహసీల్దార్ రాములమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక్కో ట్రాక్టరుకు రూ.10 వేలు వంతున అపరాధ రుసుం విధించామని, ఆ రుసుంను బ్యాంక్‌లో చలానా తీసి రసీదు సమర్పించిన అనంతరం ట్రాక్టర్లను విడుదల చేయనున్నామన్నారు.

ద్విచక్ర వాహనం దగ్ధం


దగ్ధమవుతున్న బైక్

బొబ్బిలి: పట్టణంలోని లోకబంధు రెసిడెన్సీ వద్ద రోడ్డుపై ఉంచిన ద్విచక్రవాహనం అకస్మాత్తుగా దగ్ధమైంది. బుధవారం మధ్యాహ్నం ఓ వాహన దారుడు బైక్‌ను రోడ్డు అంచునే నిలిపి ఉంచాడు. అయితే ఒక్కసారిగా బైక్ నుంచి మంటలు రావడంతో స్థానికులు ఆందోళన చెందారు. వెంటనే అక్కడే స్టైల్‌బజార్ షాపులో ఉన్న అగ్నిమాపక పరికరంతో షాపు వర్కర్లు మంటలను అదుపు చేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

88 కిలోల గంజాయి పట్టివేత

సాలూరు రూరల్: ఒడిశా నుంచి తరలిస్తున్న గంజాయిని సాలూరు మండలంలోని బాగువలస గ్రామం వద్ద మంగళవారం సాయంత్రం పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. ఒడిశా నుంచి పాచిపెంట మండలంలోని మాతుమూరు గ్రామం మీదుగా సుమారు 88 కేజీల గంజాయిని బొలెరో వాహనంలో ఉత్తరప్రదేశ్‌కు తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు బాగువలస గ్రామం చేరుకోగానే వెంబడించి వాహనాన్ని పట్టుకున్నారు. ఈ విషయమై రూరల్ ఎస్సై వెంకటరమణను వివరణ అడగ్గా గురువారం వివరాలు తెలియపరుస్తామన్నారు.

విలక్షణం.. గిరిజన జీవనం



- గత ప్రభుత్వ హయాంలో గిరిజన సంక్షేమానికి పెద్దపీట
- కోట్లాది రూపాయలతో మౌలిక సదుపాయాల కల్పన
- గిరిజన విశ్వవిద్యాలయం, ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణానికి చర్యలు
- మారిన పరిస్థితులు • గిరిపుత్రులకు పునరావృతమవుతున్న కష్టాలు
- వైద్యమూ అందని దుస్థితి • ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రేపు



ప్రస్తుత సమాజం ఆధునిక పుంతలు తొక్కుతున్నా.. వారు మాత్రం ఆచారాలను కాపాడుకుంటూ భావితరాలకు అందిస్తున్నారు. ఎండైనా..వానైనా.. రాయనక.. రప్పనక..కొండనక..కోననక.. కష్టం ఎంతైనా చెదరని చిరునవ్వు.. తరాలు మారినా, మరువని సంస్కృతి అడవితల్లి బిడ్డలకే సొంతం. చెట్టుచేమలను నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీ గిరిజనుల సంప్రదాయాలు నేటికీ సజీవ సాక్ష్యంగా ఉన్నాయి. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రేపు. వారికంటూ ప్రత్యేకమైన రోజు ఇది.

-సాక్షి, పార్వతీపురం మన్యం/సీతంపేట


నృత్యాలు చేస్తున్న గిరిజన యువతులు

పార్వతీపురం మన్యం జిల్లాలో రెండు ఐటీడీఏలు ఉన్నాయి. కొమరాడ, గుమ్మలక్ష్మీపురం, పాచిపెంట, సాలూరు, మక్కువ, సీతంపేట, కురుపాం తదితర మండలాల్లో ఉన్న కొండలపై వందల సంఖ్యలో గిరిజన గ్రామాలున్నాయి. ఎక్కడో దూరాన విసిరేసినట్లు ఉండే ఈ గ్రామాల్లో గడిచిన ఐదేళ్ల క్రితం వరకు కనీసం రహదారి సౌకర్యం కూడా ఉండేది కాదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో రూ.కోట్లు వెచ్చించి మారుమూల గిరిజన ప్రాంతాలకు సైతం రహదారులు వేశారు. దీంతో వారికి రవాణా సమస్యలు తప్పాయి. గతంతో పోల్చుకుంటే డోలీ మోతలు చాలావరకు తగ్గాయి. కొన్ని ప్రభుత్వాలు వారిని కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తుండడం వల్ల వారికి దక్కాల్సిన ఫలాలు మైదాన ప్రాంతాలకు తరలిపోతున్నాయి.

ఉన్నత విద్య కల సాకారమయ్యేనా?

గిరిజనులకు గుర్తింపుగా.. గిరిజన కుటుంబాల్లో విద్యాదీపం వెలిగించేలా ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం కింద అప్పటి ఉమ్మడి విజయనగరం జిల్లాకు గిరిజన విశ్వవిద్యాలయం మంజూరైంది. గిరిజనులకు అందుబాటులో ఉండేలా..గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మెంటాడ, దత్తిరాజేరు మండలాల మధ్య 561.88 ఎకరాలను సేకరించింది. మౌలిక సదుపాయాల కల్పనకు, రైతులకు నష్టపరిహారం కోసం రూ.430 కోట్లు మంజూరు చేసింది. గత ఏడాది ఆగస్టులో నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించాల్సి ఉన్న సమయంలో..ప్రస్తుత కూటమి ప్రభుత్వం గిరిజనులపై కక్ష సాధింపు అన్నట్లుగా విశ్వవిద్యాలయాన్ని విజయనగరం జిల్లా కొత్తవలస మండలం రెల్లి వద్దకు తరలించే ఏర్పాట్లు చేస్తోంది. ఇది ముమ్మాటికీ గిరిజనులను మోసగించే చర్యే అన్న అభిప్రాయం గిరిజన సంఘాల నుంచి వ్యక్తమవుతోంది.

మరోవైపు గిరిజన కుటుంబాల్లోని ప్రతి విద్యార్థికీ ఉన్నత విద్యావకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కురుపాం నియోజకవర్గంలోని టేకరఖండి వద్ద గిరిజన ఇంజినీరింగ్ కళాశాలను తలపెట్టింది. దాదాపు 105 ఎకరాల విస్తీర్ణంలో రూ.190 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టింది. సుమారు 80 శాతం పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. ఇంకా మిగులు పనులపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టలేదు.

వైద్యం అందని ద్రాక్ష కారాదు..

జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం, కురుపాం, కొమరాడ, జియ్యమ్మవలస, సాలూరు, భామిని, సీతంపేటలోని కొన్ని మారుమూల గ్రామాలకు ఊటనీరే దిక్కవుతోంది. సురక్షిత నీరు అందకపోవడం వల్ల ప్రజలు తరచూ అనారోగ్యం బారిన పడుతున్నారు. వర్షాల సీజన్ వచ్చిందంటే గిరిజన ప్రాంతాల్లోని ఆస్పత్రులు కిటకిటలాడిపోతాయి. ప్రస్తుతం మలేరియా, టైఫాయిడ్, డెంగీ రోగుల తాకిడి ఎక్కువగా ఉంటోంది. జిల్లాలో 37 పీహెచ్‌సీలుండగా..ఒక్కో ఆస్పత్రిలో రోజుకు కనీసం 80కిపైగా ఓపీ నమోదవుతోంది. జిల్లా ఆస్పత్రిలో 500 వరకు ఓపీ ఉంటోంది. ప్రస్తుతం సరైన వైద్య సదుపాయం గిరిజనులకు అందడం లేదు. మందులు అందుబాటులో లేవు. గత నెలలోనే ఇద్దరు చిన్నారులు మరణించడం కలవరపాటుకు గురి చేస్తోంది. రక్తహీనత, సికిల్‌సెల్ ఎనీమియా వంటివి గిరిజనులను పీడిస్తున్నాయి. జిల్లాలోని గిరి ప్రాంతాల్లో 200 మందికిపైగా గిరిజనులు సికిల్‌సెల్ ఎనీమియాతో బాధ పడుతున్నారు. జిల్లాకో వైద్య కళాశాల మంజూరుకు గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గిరిజనులకు నాణ్యమైన, మెరుగైన వైద్యం అందించాలన్న ఉద్దేశంతో పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో రూ.600 కోట్లతో వైద్యకళాశాలను నిర్మిస్తామని ప్రకటించింది. పార్వతీపురం, సీతంపేటలలో రూ.50 కోట్ల చొప్పున వ్యయంతో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణం జరగాల్సి ఉంది. ఇవి పూర్తయితే, గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందుతాయి. కూటమి ప్రభుత్వం దాన్ని కొనసాగించాలని గిరిజనులు కోరుతున్నారు. గతంలో 'ఫ్యామిలీ డాక్టర్' పేరిట వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గిరిజనుల ముంగిటకే వైద్యసేవలను తీసుకెళ్లింది. 29 వాహనాలను జిల్లాకు కేటాయించి, వాటిలో 67 రకాల మందులను అందుబాటులో ఉంచి వైద్యసేవలందించింది. నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదు.

మళ్లీ కొండ దిగాల్సిందేనా..?

లబ్ధిదారుల చెంతకే రేషన్ సరుకులు అందించేలా గత ప్రభుత్వం ఎండీయూ వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. దీనివల్ల ముఖ్యంగా గిరిజనులకు ఇది ప్రయోజనకరంగా ఉండేది. సీతంపేట, సాలూరు, గుమ్మలక్ష్మీపురం, మక్కువ తదితర ప్రాంతాల్లో ఎత్తయిన కొండలపై ఉన్న గిరిజన గ్రామాల ప్రజలు కొండ దిగి రావాలంటే సుమారు 3, 4 కిలోమీటర్ల మేర కాలినడకన ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఒక్క సీతంపేట ఏజెన్సీలోనే మొత్తం 542 గిరిజన గ్రామాలుండగా..వాటిలో 250కిపైగా గ్రామాలు కొండలపైన ఉన్నవే. రేషన్ డోర్ డెలివరీ విధానం వల్ల దాదాపు గ్రామాల సమీపానికి వాహనాలు వెళ్లి సరుకులు అందించేవి. దీనివల్ల గిరిజనులకు శ్రమ తప్పేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గిరిజన ప్రాంతాలకు ఎండీయూ వాహనాల సేవలను నిలుపు చేసింది. దీంతో వారు మళ్లీ సరకుల కోసం కొండ దిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అక్షరాలే ఆరాధ్యదేవతలు

ఏజెన్సీ ప్రాంతాల్లో వైవిధ్యముంది. ఇక్కడ అక్షరాలను ఆరాధ్యదేవతలుగా గిరిజనులు పూజిస్తారు. ఏజెన్సీలో అక్షరబ్రహ్మ, మడిబ్రహ్మ వంటి ఆలయాలు వెలిశాయి. అక్కడ గిరిజనులు ప్రతి గురువారం పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. పితృదేవతలకు పూజలు చేసినా నైవేద్యంగా నాటు సారా పెట్టి పూజ అనంతరం పూటుగా సారా సేవిస్తారు. జీలుగు సారా వంటివి చెట్టునుంచి దించితే ముందుగా తెడ్లతో సేవిస్తారు. వారి పండగలు, సంప్రదాయాలను బొమ్మల రూపంలో వేయడంలో వారికి వారేసాటి. సవర లిపి ద్వారా కొంతమంది ఆదిమ గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. వీరు వేసే లిపికి మైదాన ప్రాంతాల్లోమంచి డిమాండ్ ఉంది. ఇటీవల కాలంలో దీనిని అభివృద్ధి చేస్తున్నారు.


ఆదివాసీలు ధరించే కడియాలు

కట్నాలు లేని వివాహాలు..

ఆదివాసీ ప్రాంతాల్లో వివాహ ఆచారం వింతగా ఉంటుంది. మైదాన ప్రాంతంలో వరకట్న భూతం వెంటాడుతున్న నేటి రోజుల్లో ఇందుకు భిన్నంగా ఆదివాసీ గ్రామాల్లో వరుడి కుటుంబసభ్యులు వధువు కుటుంబానికి ఓలి (తిరిగికట్నం) ఖర్చుల నిమిత్తం ఇచ్చే ఆచారం ఉంది. ఆదివాసీలు నిరంతర శ్రమజీవులు, అయినా తీరిక వేళల్లో మాత్రం ఆటపాటలు, ఆనందాలకు ప్రాధాన్యం ఇస్తుంటారు. పండగలు పబ్బాలు వస్తే గిరిజన గూడాల్లోని ప్రజలకు పట్టరాని సంతోషం. ఉన్న దాంట్లోనే అందరూ కలిసి కందికొత్తలు, ఆగం, టెంకపండగలను డప్పుల వాయిద్యాలతో నిర్వహిస్తారు.

గిరిజనుల ప్రధాన డిమాండ్లు ఇవీ..

- గిరిజన చట్టాలను, రాజ్యాంగ హక్కులను పరిరక్షించాలి.
- ఆదివాసీల ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతి, భాష, యాస, కట్టుబాట్లను కాపాడాలి.
- రిజర్వేషన్లు సక్రమంగా అమలు చేయాలి.
- గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ గ్రామాలుగా ప్రకటించాలి.
- అటవీ భూములు, మిగులు ప్రభుత్వ బంజర భూములకు సంబంధించి గిరిజనులకు పట్టాలు ఇవ్వాలి.
- భూములు ఉన్న గిరిజనులకు కూటమి ప్రభుత్వం ప్రకటించిన అన్నదాత పథకం కింద తక్షణం రూ.20 వేలు ఇవ్వాలి.
- గిరి ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న, మంజూరైన రహదారులు, వంతెనలను త్వరితగతిన పూర్తి చేయాలి.
- గిరిజన యూనివర్సిటీని గిరిజన నియోజకవర్గంలోనే నిర్మించాలి.
- కురుపాంలో ఉన్న గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి. విద్య, ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలను త్వరితంగా చేపట్టాలి.
- కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా మూడు సెంట్ల స్థలంలో పక్కా ఇళ్లు నిర్మించాలి. గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీని నిర్వహించాలని ఆదివాసీ గిరిజన సంఘాలు కోరుతున్నాయి.

ఆహారపు అలవాట్లు..


గిరిజనులు పండించే చిరుధాన్యాల పంటలు

ఆదివాసీలు ప్రధానంగా దంపుడు బియ్యం, గంటె, జొన్న, కొర్ర, జీలుగ పిండితో జావ చేసుకుని తాగుతారు. వీటితో పాటు అటవీ ప్రాంతంలో లభించే పలు రకాల ఆకు, దుంప కూరలను సైతం ఆహారపు అలవాటుగా తింటారు. ప్రధానంగా బొదండం కూర, చిట్టికూర, గురుంకూర, పుల్లేరుగుడ్లను కూరగా వండి తింటారు. మైదాన ప్రాంతాలకు భిన్నంగా ఆదివాసీల ఆహారపు అలవాట్లు ఆసక్తికరంగా ఉంటాయి.

నాడు మౌలిక సదుపాయాలకు పెద్దపీట

గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేశారు. పీఎంజీఎస్‌వై, ఆర్‌సీఈపీఎల్‌డబ్ల్యూ తదితర గ్రాంట్ల కింద 1,008 రహదారి పనులు రూ.1,260 కోట్లతో చేపట్టారు. గిరిజన ప్రాంతాలకూపెద్దఎత్తున రహదారులు నిర్మించారు. 58 రహదారులకు అటవీ అనుమతులు మంజూరయ్యాయి. 163 కిలోమీటర్ల మేర 84 బీటీ రోడ్లను గిరిజన ప్రాంతాల్లో నిర్మించారు. ప్రధానంగా మారుమూల గిరిజన ప్రాంతాల్లో సమాచార వ్యవస్థను మెరుగుపర్చేందుకు 196 4జీ సెల్ టవర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీ రు అందించాలన్న ఉద్దేశంతో జిల్లాలోని సుమా రు 1,503 గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ కింద 1,937 పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు.

పోడు హక్కుతో ఓ ధైర్యం

2019కి ముందు టీడీపీ ప్రభుత్వం హయాంలో గిరిజన రైతులు పోడు భూములపై సాగు మాత్రమే చేసుకునేవారు. వారికి ఎటువంటి హక్కు పత్రాలూ ఉండేవి కావు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే గిరిజనుల దశ మారింది. సాగు భూములకు హక్కులు కల్పించారు. కురుపాం నియోజకవర్గంలో 32,300 మందికి 68,811.78 ఎకరాలకు సంబంధించి ఆర్‌వోఎఫ్‌ఆర్, డీకేటీ పట్టాలను అందజేశారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలోని సబ్‌ప్లాన్ మండలాల్లో 25,750 ఎకరాల విస్తీర్ణంలో 17,139 మందికి ఆర్‌వోఎఫ్‌ఆర్ పంపిణీ చేశారు. సాలూరు నియోజకవర్గంలోనూ గిరిజనులకు పెద్ద ఎత్తున పోడు హక్కులు కల్పించారు. ఫలితంగా వారికి ప్రభుత్వం నుంచి సాగు రాయితీలు, రైతు భరోసా సొమ్ము అందేవి. వీటిని కొనసాగించాల్సిన ఆవశ్యకత కూటమి ప్రభుత్వంపై ఉంది.

తైక్వాండోలో జిల్లాకు 32 పతకాలు

- రాష్ట్రస్థాయిలో మూడు విభాగాల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్


రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈ నెల 3,4 తేదీల్లో అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగిన సబ్ జూనియర్, కాడెట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొని పతకాలు సాధించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మూడు విభాగాల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. మొత్తంగా 32 పతకాలు సాధించి విద్యలనగరం విజయనగరం జిల్లా కీర్తి ప్రతిష్ఠలను చాటి చెప్పారు. పోటీల్లో సబ్ జూనియర్ పూమ్‌సే విభాగంలో ఓవరాల్ చాంపియన్ షిప్, క్యురోగి సబ్ జూనియర్ విభాగంలో ఓవరాల్ చాంపియన్‌షిప్, కేడెట్ విభాగంలో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను జిల్లా క్రీడాకారులు కైవసం చేసుకున్నారు. రెండు రోజుల పాటు జరిగిన పోటీల్లో 14 గోల్డ్, 7 సిల్వర్, 11 బ్రాంజ్ మెడల్స్ గెలుపొందారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభాపాటవాలు కనబరిచి పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావులు అభినందించారు. జిల్లా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మూడు విభాగాల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్ దక్కించుకోవడం గర్వించదగిన విషయమని పేర్కొన్నారు. క్రీడాకారులు పతకాల సాధనలో కీలకమైన కోచ్‌లు ఎం. గగన్ సాగర్ దొర, కె.చైతన్య, సీహెచ్ యశస్విని లను, గెలుపొందిన క్రీడాకారులను ప్రశంసించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఎమ్ఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి


సతీష్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

శృంగవరపుకోట: పట్టణంలోని పందిరప్పన్న జంక్షన్‌లో బుధవారం విద్యుత్ షాక్ తగిలి ఒక యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏఓ హోమ్స్‌లో తన ఇంటికి స్టీల్ గ్రిల్స్ బిగించేందుకు యజమాని కొండలరావు పట్టణానికి చెందిన వెల్డర్ దార్ల సతీష్(28)తో ఒప్పందం కుదుర్చుకున్నాడు. బుధవారం పనికి వచ్చిన సతీష్ స్టీల్ రాడ్లు మేడమీదికి తీసుకెళ్లే క్రమంలో ఎదురుగా ఉన్న విద్యుత్‌వైర్లకు రాడ్స్ తగలడంతో షాక్‌కు గురై కుప్పకూలి ప్రాణాలు వదిలాడు. ఇంటి యజమాని కొండలరావు పక్కనే ఉండడంతో అతని తలకు గాయం కాగా స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎస్.కోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

తెర్లాం: మండలంలోని ఆమిటి-సతివాడ గ్రామాల మధ్యన ఉన్న ఊటబంద కానా వద్ద గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. దీనికి సంబంధించి స్థానిక ఎస్సై ఆర్.రమేష్ బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వంతరాం -బలిజిపేట ఆర్అండ్‌బీ రోడ్డులో ఆమిటి దాటిన తరువాత ఊటబంద వద్ద గుర్తు తెలియని మృతదేహంమంగళవారం రాత్రి రోడ్డుపైన వెళ్తున్న వారికి కనిపించింది. ఆ మృతదేహాన్ని చూసిన వారు వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించగా ఎస్సై రమేష్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుని వయస్సు సుమారు 70-75ఏళ్ల ఉంటుంది. నల్ల రంగు షార్ట్ ధరించి ఉన్నాడు. గడ్డం ఎక్కువగా పెరిగి ఉంది. ఈ ఆనవాళ్లు కలిగిన వ్యక్తి గురించి ఎవరికైనా తెలిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్సై రమేష్ కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. గుర్తు తెలియని మృతదేహం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సంప్రదాయం ఉట్టిపడేలా ఆదివాసీ దినోత్సవం



సమీక్షా సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం: గిరిజన సంప్రదాయం ఉట్టిపడేలా ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఆదివాసీ దినోత్సవం నిర్వహణపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 9న ఆదివాసీ దినోత్సవాన్ని జిల్లా స్థాయిలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక కళాకృతులు, నృత్యాలు, వంటకాలు, పంటల ప్రదర్శన ఏర్పాటు చేయాలని సూచించారు. తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచడంతో పాటు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని, వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని కోరారు. నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని చెప్పారు. ఐటీడీఏ పీఓ ఎస్.సేతు మాధవన్ మాట్లాడుతూ అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఆదివాసీ దినోత్సవాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్.శోభిక, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ జి.కేశవనాయుడు, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, ఐటీడీఏ ఏపీఓ ఎ.మురళీధర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చదువుతో పాటు సమాజంపై స్పృహ అవసరం

- సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ

విజయనగరం అర్బన్:

ప్రతి విద్యార్థి చదువుతో పాటు సమాజంపై స్పృహ కలిగి జీవితాన్ని ఉన్నతంగా మలచుకోవాలని సినీగేయ రచయిత, కవి, గాయకుడు సుద్దాల అశోక్ పిలుపునిచ్చారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో జాతీయ నూతన విద్యావిధానం ద్వారా 'మంచి ఆలోచనలు-సృజనాత్మకత, మూర్తిమత్వ వికాసం' అనే అంశంపై బుధవారం జరిగిన సదస్సులో ఆయన ముఖ్యవక్తగా పాల్గొన్నారు. తొలుత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ టి.వి.కట్టిమణితో కలిసి జ్యోతి ప్రజ్వలనం చేశారు. అనంతరం సదస్సులో ఆయన మట్లాడుతూ ఉత్తమ పౌరులుగా ఉన్న సమాజమే ఉన్నతమైనదని, ఆ దిశగా సమాజ నిర్మాణానికి విద్యార్థి దశనుంచి ప్రతి ఒక్కరూ బాధ్యత కృషిచేయాలన్నారు. కష్టం వెనుక సుఖం, బాధ తరువాత ఆనందం, సహనంతోనే విజయం చేకూరుతాయని ఉద్బోధించారు. మనం ఏ స్థాయిలో ఉన్నా అత్యుత్తమ స్థాయికి ఎదిగినప్పుడే జీవితానికి సార్థకత ఉంటుందని, అదే ఫిలాసఫీని పాటల ద్వారా తెలియజేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం తన బాణీ పాటలతో విద్యార్థులను ఉర్రూతలూగించారు. వీసీ కట్టిమణి మాట్లాడుతూ జాతీయ విద్యావిధానంలో చదువుతో పాటు ఆటలు, పాటలు, లలిత కళలు, చిత్రలేఖనం, సాహిత్యం, జాతీయత, సంస్కృతి, సంప్రదాయాలను పొందుపరిచారన్నారు. అనంతరం అశోక్‌ను వీసీ దుశ్శాలువ, జ్ఞాపికతో సత్కరించారు. వర్సిటీ పరిపాలన అధికారి డాక్టర్ వి.ఎస్.సూర్యనారాయణ అనుసంధాన కర్తగా వ్యవహరించిన కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ తంత్రవాహి శ్రీనివాసన్, ప్రొఫెసర్ శరత్చంద్రబాబు, జె.ఎం.మిశ్రా, పరికిపండ్ల శ్రీదేవి, అనిరుద్‌కుమార్, సురేష్‌బాబు, దివ్య, ప్రమా, లతా, వెంకటేశ్వర్లు తదితర అధ్యాపకులు, అధ్యాపకేతరులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అశోక్‌తేజను సత్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ కట్టిమణి

విస్తారంగా వర్షాలు

పార్వతీపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలోని పలుప్రాంతాల్లో భారీవర్షాలు విస్తారంగా కురిశాయి. వర్షాలకు చెరువులు, వాగులు, పంట పొలాల్లో నీరుచేరింది. దీంతో వరి ఊబాలు గ్రామాల్లో ఊపందుకున్నాయి. జిల్లాలో బుధవారం 538.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు.


గరుగుబిల్లిలో కురిసిన వర్షం

60 రోజుల్లో దర్యాప్తు పూర్తి చేయాలి

విజయనగరం క్రైమ్: అట్రాసిటీ కేసుల దర్యాప్తును 60 రోజుల్లో పూర్తిచేసి అభియోగ పత్రాలను కోర్టులో దాఖలు చేయాలని డీఎస్పీలను ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో డీఎస్పీ స్థాయి అధికారులతో బుధవారం నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయనగరం, బొబ్బిలి, చీపురుపల్లి సబ్ డివిజన్ పరిధిలో నమోదై, దర్యాప్తులో ఉన్న అట్రాసిటీ కేసులను సమీక్షించారు. కేసుల దర్యాప్తుపై సూచనలిచ్చారు. అట్రాసిటీ కేసులను దర్యాప్తు చేసే అధికారులు విధిగా సంఘటనా స్థలాలను సందర్శించాలని, ప్రత్యక్ష సాక్షులను విచారణ చేయాలని ఆదేశించారు. నిందితులపై నేరారోపణలు న్యాయస్థానంలో నిరూపణ చేసేందుకు అవసరమైన ప్రధాన సాక్షులను విచారణ చేయాలని, సాంకేతిక ఆధారాలను సేకరించాలని, ధ్రువపత్రాలను సంబంధిత అధికారుల వద్ద నుంచి, ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి త్వరితగతిన పొందేలా చర్యలు చేపట్టాలన్నారు. అభియోగ పత్రాల తయారుచేయడంలో న్యాయ నిపుణుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. అట్రాసిటీ కేసుల్లో బాధితులకు పరిహారం సకాలంలో అందేందుకు ఎప్పటికప్పుడు ప్రతిపాదనలు సిద్ధం చేసి కలెక్టర్ కార్యాలయానికి పంపాలన్నారు. సమావేశంలో బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.చక్రవర్తి, డీటీసీ డీఎస్పీ ఎం.వీరకుమార్, డీసీఆర్‌బీ ఎస్ఐలు గణేష్, మురళి, జూనియర్ సహాయకులు ఆర్.వి.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.